సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 8 । నవంబర్ । 2023



శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంఘం ఆధ్వర్యంలో ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు వినతిపత్రం అందజేశారు. IIలో



అపూర్వం.. అనివేటి మండపం

ప్రకృతి అందాల నడుమ కొల్లేటి పెద్దింట్లమ్మ ఆలయం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం అదనపు ఆకర్షణ కానుంది. IIలో ▸



రవాణా సిబ్బందిపై దురుసు ప్రవర్తన

విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారులపై జనసేన నేత కునుకు రామకృష్ణ దురుసుగా ప్రవర్తించారు. దీనిపై పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. IIలో ▸

న్యూస్‌రీల్

ఈవీఎంలు పరిశీలించిన కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ఫస్ట్ లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం సీడబ్ల్యూసీ గొడౌన్‌లో ఏర్పాటుచేసిన ఈవీఎంలను మంగళవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం గడువులోపు ఫస్ట్ లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ చెక్ పాయింట్, రిజిస్టర్, సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు.

మద్దిలో కార్తీక ఉత్సవాలకు ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఈనెల 14 నుంచి డిసెంబర్ 12 వరకు కార్తీక మాస మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. మంగళవారం గురవాయిగూడెం మద్ది క్షేత్రంలో ఈఓ మాట్లాడుతూ కార్తీక మాసం నెలరోజుల పాటు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టు కుని ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ల ఏర్పాట్లతో పాటు, ప్రతి భక్తుడికి స్వామి ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్తీక సోమవారాల్లో ఉదయం 8 గంటల నుంచి లక్ష తమలపాకులతో లక్షార్చనలు, ప్రతీ బుధవారం పలు రకాల పుష్పాలతో లక్షార్చనలు జరుగుతాయన్నారు. ఆదివారాల్లో సువర్చలా సహిత హనుమద్ కల్యాణాలు జరుగుతాయన్నారు. ఈ నెల 16 నుంచి 23 వరకు 30వ సంవత్సర సప్తాహ మహోత్సవాలు జరుగుతాయన్నారు. మహోత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హోమాలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సప్తాహ మహోత్సవాల్లో భాగంగా 22 న ఉపాలయంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. డిసెంబర్ 10న పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం జరుగుతుందన్నారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. రూ.1,35,217 ఆదాయం వచ్చినట్లు, 1,000 మంది భక్తులు స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

17న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు(మెట్రో): పశ్చిమగోదావరి జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తారని జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19 నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 19, 26, వచ్చే నెల 3, 10 తేదీల్లో భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు రాత్రి 9 గంటలకు బయలుదేరుతాయని, భీమవరం డిపో నుంచి 30 బస్సు సర్వీసులు అందిస్తున్నామని అన్నారు. టికెట్ ధరలు పల్లె వెలుగు రూ.700, ఎక్స్‌ప్రెస్ రూ.900, అల్ట్రా డీలక్స్ రూ.1,000, సూపర్ లగ్జరీ రూ.1,100గా నిర్ణయించామని అన్నారు. ఇతర విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తామని, ఈ పంచారామలకు ఒక గ్రామం నుంచి 40 మంది ఉంటే బస్సు ఆ గ్రామం నుంచే బయలు దేరుతుందని తెలిపారు. శబరిమలైకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, స్వాములకు కావాల్సిన విధంగా బస్సులను సిద్ధం చేస్తామన్నారు. ఇప్పటికే రెండు ప్యాకేజీలు సిద్ధంగా ఉన్నాయని వాటిలో ఒకటి 6 రోజులు, మరొకటి 8 రోజుల యాత్రా ప్యాకేజీలని చెప్పారు.

ఆచరణలో సాధికారత

- బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట
- ఉమ్మడి పశ్చిమలో మంత్రులు మొదలుకొని నామినేటెడ్ పదవుల వరకు
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే..
- నేడు పాలకొల్లులో సామాజిక సాధికార బస్సు యాత్ర

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గ్రామ స్థాయి నుంచి మంత్రి పదవుల వరకు బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఇతర రాజకీయ పార్టీల్లా ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓటు బ్యాంకును వాడుకుని వారిని విస్మరించకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక, రాజకీయ సాధికారత కల్పించారు. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌ను... బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా మార్చి చూపారు. నామినేటెడ్ పదవుల్లోనూ జిల్లా, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవుల్లోనూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చి అట్టడుగు వర్గాలకు అగ్రాసనం వేసి రాజకీయంగా బలమైన పునాదులు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెప్పే విధంగా నా ఎస్సీ.. నా ఎస్టీ... నా బీసీ సోదరులు అనే మాటను పూర్తి ఆచరణలో చూపి రాజకీయంగా ఎదుగుదలకు పూర్తిగా సహకరించారు. ఈ పరిణామాల క్రమంలో గడిచిన నాలుగేళ్ల 7 నెలల పరిపాలనలో ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా బుధవారం పాలకొల్లులో సామాజిక సాధికారత బస్సు యాత్రను నిర్వహించనున్నారు.



పాలకొల్లు గాంధీబొమ్మల సెంటరులో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

మంత్రి పదవులు, ఎమ్మెల్సీ పదవుల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో కేటాయింపులు మొదలుకొని మంత్రి పదవుల వరకు అన్నింటిలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పాదయాత్రలో ఇచ్చిన హామీకి మించి పదవులు ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి పౌరసరఫరాల శాఖా మంత్రిగా కారుమూరి నాగేశ్వరరావు, హోం మంత్రిగా తానేటి వనితలు కేబినెట్‌లో కొనసాగుతున్నారు. దళిత వర్గాలకు చెందిన కొయ్యే మోషేన్‌రాజు శాసనమండలి చైర్మన్‌గా ఉన్నారు. జిల్లాలో శాసనమండలి సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. మూడు స్థానాలకు గాను రెండు స్థానాలు బలహీన వర్గాలకు చెందిన నేతలనే ఎన్నిక చేశారు. బీసీ వర్గానికి చెందిన కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకట రమణకు సభ్యులుగా అవకాశం కల్పించారు.

నామినేటెడ్ పదవుల్లోనూ..

రాష్ట్ర స్థాయిలో కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్‌గా బర్రి లీల, ఎంఈసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పెండ్ర వీరన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా గుబ్బల తమ్మయ్య, డీసీఎంఎస్ చైర్మన్‌గా వేండ్ర వెంకటస్వామి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్‌గా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు వైస్ చైర్మన్‌గా దయాల నవీన్‌బాబు, సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా శెట్టి అనంతలక్ష్మి, అతిరస కార్పొరేషన్ చైర్మన్‌గా ఇళ్ళ భాస్కరరావు, వడ్డీల కార్పొరేషన్ చైర్మన్‌గా సైదు గాయత్రీ సంతోష్, ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలిగా గంజిమాల దేవిలకు రాష్ట్ర స్థాయి పదవుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో సుమారు 300 మందికిపైగా వివిధ కార్పొరేషన్లు, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవుల ద్వారా ప్రాతినిధ్యం లభించింది.

నేడు పాలకొల్లులో సభ

53 నెలల ప్రభుత్వ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేసిన మేలును వివరించడమే ప్రధాన ఎజెండాగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రలు నిర్వహిస్తుంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పాలకొల్లులో సాధికార బస్సు యాత్ర జరగనుంది. జిల్లాలో ఇప్పటికే నర్సాపురంలో, దెందులూరులో నిర్వహించిన బస్సు యాత్రలు సూపర్‌సక్సెస్ కావడంతో పార్టీ కేడర్‌లో జోష్ నెలకొంది. ఈ క్రమంలో పాలకొల్లు సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజకవర్గ సమన్వయకర్త గూడాల గోపి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, విడదల రజని, చెల్లుబోయిన వేణుగోపాల్, కారుమూరి నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు నందిగం సురేష్, మార్గాని భరత్, మండలి స్పీకర్ కొయ్యే మోషేన్‌రాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని పడాల మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏడీఏ పి.మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సీఎం అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. రైతులకిచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కింద జిల్లాలో 1,26,926 మంది రైతులకు రూ.58.78 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రైతులకు రూ.8.72 కోట్లు జమ కానున్నాయన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో రూ.33,210 కోట్లు రైతులకు నేరుగా సొమ్ములు జమ అయ్యాయన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీని పూర్తిగా అమలు చేశారన్నారు. 2014 ఎన్నికల ముందు రూ.86,500 కోట్ల రుణమాఫీ చేస్తానని నమ్మించి చంద్రబాబు రైతులు మోసగించాడన్నారు. కాపు ఓట్లను కాజేయడానికి పవన్ కల్యాణ్‌ను 2014 ఎన్నికల్లో చంద్రబాబు అక్కున చేర్చుకున్నాడన్నారు. ప్రశ్నించడానికి పుట్టిన పార్టీ చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. కోర్టు దోషిగా నిర్ధారించిన వ్యక్తికి పవన్ పాదాభివందనం చేసి, కాపు జాతి పరువు తీశాడన్నారు.

బస్సు యాత్రకు ఏర్పాట్లు

నేడు పాలకొల్లులో సామాజిక సాధికార యాత్ర



పాలకొల్లు రామచంద్రగార్డెన్స్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), జేసీఎస్ చైర్మన్ పుత్తా ప్రతాప్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన ప్రయోజనాలను వివరించేందుకు తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. స్థానిక రామచంద్ర గార్డెన్స్‌లో పార్టీ ముఖ్య నాయకులతో బస్సు యాత్ర ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. 8వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గాంధీబొమ్మల సెంటర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర మంత్రులు విడదల రజని, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, విప్ గ్రంధి శ్రీనివాస్ పాల్గొంటున్నట్లు గుడాల గోపి చెప్పారు. బస్సు యాత్రకు ఇప్పటికే కరపత్రాలు, గోడ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం చేశామన్నారు. సభా స్థలికి కనీసం 25వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల నుంచి, పాలకొల్లు మండలం, యలమంచిలి, పోడూరు మండలంలోని 8 గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు తరలి వచ్చేలా బస్సులు, ఆటోలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, రాష్ట్ర జేసీఎస్ చైర్మన్ పుత్తా ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ చైర్మన్ ఘంటా ప్రసాద్, రాష్ట్ర బూత్ కన్వీనర్ బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, మంతెన యోగేంద్ర బాబు, తెన్నేటి కిషోర్, ముచర్ల శ్రీరామ్, అడబాల వెంకటరమణ, గొర్రెల శ్రీనివాస్, మానుకొండ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిపై కలెక్టర్ సమీక్ష



సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా వరిసాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ సాగుకు వంతుల వారీగా సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో సాగునీటి వనరులను దృష్టిలో పెట్టుకుని వరి సాగుకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. డెల్టా ప్రాంతంలో ఏ పంటను సాగుచేస్తే రైతులకు అధిక లాభం కలుగుతుందో గుర్తించాలన్నారు. నరసాపురం మండలం ధర్బరేవు, కాజా గేట్స్, శేషవతారం ప్రాజెక్ట్ నిర్మాణం, మరమ్మత్తు పనులు, ఉండి మండలం కలిసిపూడి నుంచి చెరుకువాడ ప్రధాన కాలువ, గోస్తా నది చానల్, రేలంగి చానల్, లోసరి ప్రధాన కాలువ వంటి ప్రధాన కాలువల్లో తూడు, కిక్కిస తొలగింపు, బండ్స్ నిర్మాణం, షట్టర్లు, స్లూయిస్ మరమ్మతు పనులకు సంబంధించిన నివేదికను వెంటనే ఇవ్వాలన్నారు.

రైతుకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

కలెక్టర్ పి.ప్రశాంతి

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం కౌలు, సన్న, చిన్నకారుల రైతులకు వెన్నుదన్నుగా వైఎస్ఆర్ రైతు భరోసా అమలు చేస్తోందని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. గత ఐదేళ్లుగా అమలుచేస్తున్న రైతు భరోసా ఈ ఏడాది రెండో విడతగా జిల్లాలో 1,26,960 మంది రైతులకు రూ.50.78 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేస్తున్నట్లు చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నగదు జమచేసిన సందర్భంగా కలెక్టరేట్‌లో కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఆ పంట కాలం ముగిసేలోపుగానే అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దుకోవాలన్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో ఒక్కో రైతుకు ఏడాదిలో రూ.13,500 అందిస్తుండగా మొదటి విడతగా మే నెలలో రూ.7,500 జమచేయగా రెండో విడతగా రూ.4వేలు చొప్పున జమచేస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా రైతులకు నగదు జమ వివరాలను వెల్లడించారు. ఆచంట నియోజకవర్గంలో 27,263 మంది రైతులకు రూ.10.91 కోట్లు, భీమవరంలో 10,807 మందికి రూ.4.32 కోట్లు, నరసాపురంలో 13,319 మందికి రూ.5.32 కోట్లు, పాలకొల్లులో 12,757 మందికి రూ.5.10 కోట్లు, తాడేపల్లిగూడెంలో 21,812 మందికి రూ.8.72 కోట్లు, తణుకులో 20,215 మందికి రూ.8.9 కోట్లు, ఉండిలో 14,339 మందికి రూ.5.74 కోట్లు, గణపవరం మండలంలోని 6,448 మంది రైతులకు రూ 2.58 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.



పడాల మార్కెట్ యార్డులో రైతు భరోసా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

రైతు భరోసా చెక్కు అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల మార్కెట్ యార్డులో వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని 21,812 మంది రైతులకు మంజూరైన రూ.8.72 కోట్ల విలువైన చెక్కును డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతును అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు

చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: కార్తీక మాసం దృష్ట్యా పేరుపాలెం బీచ్‌లో యాత్రికుల రద్దీకి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పేరుపాలెం బీచ్‌లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఆర్డీవో ఎం.అత్యుత్ అంబరీష్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముదునూరి మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతునన్న నేపథ్యంలో బీచ్‌లో ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సముద్రంలో లోతుకు దిగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇటీవల సముద్రంలో పలువురు గల్లంతైన ఘటనల దృష్ట్యా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి యువకులు బీచ్ వద్దకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే స్నానాలకు అనుమతి ఇవ్వాలని చెప్పారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. నరసాపురం ఆర్డీవో అత్యుత్ అంబరీష్ మాట్లాడుతూ బీచ్ వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. బీచ్‌లో పారిశుధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మద్యం అందుబాటులో లేకుండా చర్యలు చేపట్టాలని, చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేయాలన్నారు. శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, అనితకుమారి, జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో ఆర్డీవో అంబరీష్

ఏడాదంతా ఉపాధి

- అక్టోబర్ నాటికి 96.99 శాతం లక్ష్యం పూర్తి
- ఉపాధి హామీలో రూ.79.16 కోట్ల చెల్లింపు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించడమే లక్ష్యంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) అధికారులు పనులు చేయిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా సాగునీటికి పంట కాలువలు, పంట బోదెల్ని ఉపాధి కూలీలతో బాగు చేయిస్తున్నారు. మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, రైతుల కుంటలు, పండ్ల తోటల పెంపకం, తదితర ఉపాధి పనులు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు 1500 మంది వరకు పని చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇంతవరకు కూలీలకు రూ.79.16 కోట్లు చెల్లింపు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంతవరకు ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రభుత్వం కూలీలకు రూ.79.16 కోట్లు చెల్లించారు. రోజుకు రూ.239.75 చెల్లిస్తున్నారు. అక్టోబర్ నాటికి ఉపాధి హామీ పనుల లక్ష్యం 34 లక్షల పని దినాలు కాగా ఇంత వరకు 33 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. 33 లక్షల పనిదినాలకు రూ.79.16 కోట్లు చెల్లించారు.



పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో మొత్తం

జాబ్ కార్డులు	:	1.66 లక్షలు
మొత్తం కూలీలు	:	2.76 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డ్స్	:	1.25 లక్షలు
కూలీలు	:	1.93 లక్షలు

96.9 శాతం లక్ష్యం సాధించాం



ఉపాధి హామీ పథకం పనులు ఏడాదంతా కల్పిస్తున్నాం. ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకూ ఏడాది లక్ష్యంగా ఏర్పాటు చేసుకుని ఉపాధి పనులు చేయిస్తున్నాం. ఈ ఏడాది అక్టోబర్ నాటికి 96.9 శాతం లక్ష్యాన్ని చేరుకున్నాం. ప్రస్తుతం పంట బోదెలు, పంట కాలువలు మొక్కల పెంపకం తదితర పనులు నిర్వహిస్తున్నాం. ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడానికి తగు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డ్వామా పీడీ

హక్కు పత్రాలు త్వరితగతిన అందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భూ యాజమాన్య హక్కులను లబ్ధిదారులకు ఇచ్చే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం జేసీ చాంబరులో అసైన్డ్ భూములపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన భూముల దస్త్రాలను, రిజిస్టర్లను జిల్లా జాయింటు కలెక్టరు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 20 సంవత్సరాల పైగా అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులను గుర్తించి వారికి యాజమాన్య హక్కులను కల్పిస్తున్నామన్నారు. పెనుగొండ, నరసాపురం, అత్తిలి, వీరవాసరం, ఇరగవరం తదితర మండలాల్లో అసైన్డ్ భూములను రైతులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు ఈ.నాగార్జున, ఆయా మండలాలు డిప్యూటీ తహసీల్దారు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సర్పంచుల గౌరవ వేతనం విడుదల

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎన్నికలు జరిగిన 393 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2023-24 ఏడాదికి సర్పంచులకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం విడుదల చేశారని జిల్లా పంచాయతీ అధికారి జీవీ మల్లికార్జునరావు తెలిపారు. 9 నెలలకు రూ.3 వేల చొప్పున ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.27 వేలు విడుదల చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.1,06,11,000, వృత్తిపన్ను గ్రాంట్ రూ.45,69,374, తలసరి గ్రాంట్ రూ.26,24,680 జిల్లాలోని ఆయా పంచాయతీలకు సర్దుబాటు చేశామన్నారు.

నేడు వాహనాల వేలం

వీరవాసరం: వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వేలం వేస్తామని ఎస్సై పి.రమేష్ మంగళవారం చెప్పారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

అపూర్వం.. అనివేటి మండపం

- దాతల సాయం రూ.4.50 కోట్లతో నిర్మాణం
- కొలువుతీరుతున్న దేవతామూర్తుల శిల్పాలు
- కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి కొత్త కళ

కైకలూరు: చుట్టూ నీరు, పక్షుల కిలకిలరావాలు.. ప్రకృతి అందాల నడుమ కొల్లేటి పెద్దింట్లమ్మ ఆలయం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. కొల్లేరు సరస్సు తీరాన 11వ శతాబ్ద కాలంలో వేంగి–చాళుక్య రాజులు నిర్మించిన ఈ దేవాలయానికి ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం అదనపు ఆకర్షణ కానుంది. ఆ కాలంలో 150 రాజ హస్తాల వెడల్పు, 7 నిలువుల లోతు, 3 కోశాల చుట్టు కొలతతో కొల్లేటికోట ఉందని చైనా యాత్రికుడు హ్యుయన్‌త్సాంగ్ తన పుస్తకంలో రాయడం విశేషం. దేవాలయం వద్ద బయల్పడిన శిలాఫలకాలలో అప్పటి చరిత్ర లిఖించబడి ఉంది. ఏటా పెద్దింట్లమ్మకు జాతర (తీర్థం) జరుగుతోంది. తెలంగాణ బోనాల సంప్రదాయం మాదిరిగా అమ్మవారికి కలువబోనాలు సంప్రదాయం 2020 నుంచి పాటిస్తున్నారు.

80 శాతం పనులు పూర్తి

కొల్లేటికోట అనివేటి మండప నిర్మాణానికి రూ.4.50 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కొల్లేరు పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, అమ్మవారి భక్తులు విరివిగా విరాళాలు అందించారు. 2022 మే 5న అనివేటి మండప నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శంకుస్థాపన చేశారు. 105 అడుగుల వెడల్పు, 305 అడుగుల పొడవుతో నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 80 శాతం పనులను పూర్తి చేశారు. దాతల విరాళాలను నిర్మాణ సామగ్రి రూపంలో కొనుగోలు చేసి పారదర్శకంగా పనులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ఆదేశాలతో కుమారుడు దూలం ఫణి శ్యామ్‌కుమార్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద నిర్మిస్తున్న భారీ అనివేటి మండపం


పెద్దింట్లమ్మ తల్లి


విగ్రహాలను చెక్కుతున్న శిల్పి


నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ (ఫైల్)

అపురూపం.. శిల్పకళా నైపుణ్యం

అనివేటి మండపంలో ఒక పక్క 18, ఎదురుగా మరో 18 వెరసి 36 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడకు చెందిన ప్రముఖ శిల్పి సూరిబాబు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఒక పక్క అష్టాదశ శక్తి పీఠాలకు చెందిన శాంకరి (శ్రీలంక), కామాక్షి (తమిళనాడు), శృంఖల (పశ్చిమబెంగాల్), చాముండి(కర్ణాటక), జోగులాంబ (తెలంగాణ), భ్రమరాంబిక (ఆంధ్రప్రదేశ్), మహాలక్ష్మీ(మహారాష్ట్ర), ఏకవీరిక (మహారాష్ట్ర), మహాకాళి (మధ్యప్రదేశ్), పురుహూతిక(ఆంధ్రప్రదేశ్), గిరిజా (ఒడిషా), మాణిక్యాంబ (ఆంధ్రప్రదేశ్), కామరూప (అసోం), మాధవేశ్వరీ (ఉత్తరప్రదేశ్), వైష్ణవి (హిమాచలప్రదేశ్), మంగళ గౌరీ (బీహార్), విశాలక్ష్మీ(ఉత్తరప్రదేశ్), సరస్వతీ (జమ్ము కాశ్మీర్) రూపాలతో పాటు ఎదురుగా నవదుర్గలు శైలపుత్రి, బ్రహ్మచారిణీ, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిరాత్రి ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కాకుండా సమీప జిల్లాల్లో పేరు గడించిన ప్రముఖ అమ్మవార్ల విగ్రహాలను నిర్మిస్తున్నారు.

వారధి నిర్మాణంతో పెరుగుతున్న భక్తులు

కొల్లేరు ప్రజల చిరకాల వాంఛ అయినా సర్కారు కాల్వపై వారధి నిర్మాణం పూర్తయ్యింది. తెలుగుదేశం పాలనలో ఆలస్యం అవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కృషితో నిర్మాణం పూర్తి చేశారు. దీంతో అమ్మవారి దేవస్థానికి విచ్చేసే భక్తుల సంఖ్య పెరుగుతోంది. అనివేటి మండపం పూర్తయితే సమీప జిల్లాల్లోనే అతిపెద్ద మండపంగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం పేరుగడించనుంది.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద నిర్మిస్తోన్నా అనివేటి మండపం కొల్లేరు గ్రామాలకే మణిహారంగా మారుతోంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సహకారంతో అన్ని పనులు జరుగుతోన్నాయి. అన్ని తనై ఎమ్మెల్యే కృషి చేస్తోన్నారు. దాతలందరికీ ధన్యవాదాలు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శిల్పకళానైపుణ్యంతో దేవతామూర్తుల ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. నూతన ఏడాదిలో ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నాం.

– కందుల వేణుగోపాలరావు,
ఈవో, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

● గడపగడపకు సంక్షేమం


ఉండి: ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఏలూరులో వాయిద్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎంపీ, ఎమ్మెల్యేలకు నాయీబ్రాహ్మణ సంఘ నాయకుల వినతి

ఏలూరు (టూటౌన్): నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారులకు ఏలూరులో ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యలమందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.కోటి పైన ఆదాయం ఉన్న దేవాలయాలు 70, రూ.25 లక్షల ఆదాయం ఉన్నవి సుమారుగా 1378, మొత్తం 1,448 ఈవో కేటగిరి దేవాలయాల్లో డోలు, నాదస్వరం, శృతి, తాళం పోస్టులు సుమారు 2,500 ఖాళీగా ఉన్నాయన్నారు. ముఖ్యమైన దేవాలయాల్లో ఈ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రార్థన దేవదాయ చట్టంలో అర్చకులకు, భజంత్రీలు పెన్షన్ కింద పొందుపర్చబడిందన్నారు. అర్చకులకు వంశ పారంపర్య హక్కు కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వీరితో పాటుగా భజంత్రీలకు కూడా ఈ జీవోను వర్తింపచేయాలని కోరారు. 45 ఏళ్ల దాటిన వాయిద్య కళాకారులకు పెన్షన్ ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ తన పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీ మేరకు కళాకారులకు నంది, హంస, ఉత్తమ సేవ వంటి అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఉమ్మడి 13 జిల్లాల్లో దాదాపు రెండు లక్షల వాయిద్య కళాకారులకు వేతన స్కేలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందనాడ నందేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు చెడే వెంకన్న, జిల్లా కార్యదర్శి కింజంగి రాజు, నగర అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు నాపుగోపు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు పెద్ద ఎత్తున మేళతాళాలతో ఊరేగింపుతో ఎంపీ, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు తరలివెళ్లారు.


ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుమూ లేకుండా ప్రవేశాలు పొందడానికి మరో అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీ వరకు గడువు ఇవ్వగా ప్రస్తుతం ఆ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంబంధిత అధీకృత స్టడీ సెంటర్ల ద్వారా, ఏపీఓఎస్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరుగైన నిర్వహణతోనే కళాశాలల అభివృద్ధి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

తణుకు టౌన్: ప్రభుత్వ కళాశాలల టోటల్ క్వాలిటీ మేనేజమెంట్ కళాశాల సుస్థిర అభివృద్ధిని సూచిస్తుందని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. మంగళవారం తణుకులోని ఎస్సీవిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్‌లో హాలులో నిర్వహించిన టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ వర్క్‌షాపును ఉద్దేశించి ఆయన అంతర్జాలంలో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యలో ఇటీవల వచ్చిన పలు మార్పులను వివరించారు. కళాశాల విద్య ప్రాంతీయ సంచాలలకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు ద్వారా కళాశాలలో వసతుల కల్పనకు అవసరమైన నిధులు అందుతాయన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ బీ రాజశేఖర్ మాట్లాడుతూ కళాశాల పనితీరును మదించే నాక్‌లో గ్రేడింగ్ విధానం భవిష్యత్‌లో ఉండకపోవచ్చన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ప్రక్రియ 2015 నుంచి అమలులోకి వచ్చిందని, ఇది ఐదు పారామీటర్లలో ఉంటుందని, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో రాష్ట్రం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ పొందడంలో డాక్యుమెంటేషన్ చాలా ముఖ్యమైన ప్రక్రియన్నారు. నాక్ గుర్తింపు పొందిన తర్వాత ఎన్ఐఆర్ఎఫ్, యన్‌బీఏ, ఏఆర్ఐఐఏ గుర్తింపు పొందడం ద్వారా కళాశాలల ఆర్థిక స్వావలంబన సాధనకు అవసరమైన నిధులను పొందవచ్చని చెప్పారు. తణుకు ఎన్ఆర్‌సీ పరిధి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ, ఎన్ఐఆర్ఎఫ్ కో–ర్డినేటర్లు పాల్గొన్నారు.

రవాణా శాఖ సిబ్బందిపై దురుసు ప్రవర్తన

భీమవరం(ప్రకాశం చౌక్): విధి నిర్వహణలో ఉన్న రవాణా శాఖ అధికారులపై దురుసుగా ప్రవర్తించిన జనసేన నేత కునుకు రామకృష్ణపై మంగళవారం పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వీరవాసరంలో వాహనాల తనిఖీ కోసం వెళుతూ పాలకోడేరు మండలం పెన్నాడ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఒక వాహనాన్ని తనిఖీ చేయాల్సిందిగా ఎంవీఐలు రవి, లక్ష్మి తమ వద్ద ఉన్న హోంగార్డును ఆదేశించగా, హోంగార్డు తనిఖీ చేస్తున్న సమయంలో రామకృష్ణ దురుసుగా ప్రవర్తించడంతో భయాందోళనకు గురైన అధికారులు పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన వీరవాసరంలో వాహనాల తనిఖీల కోసం వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ రవి, లక్ష్మి వెళుతున్నారు. పాలకోడేరు మండలం పెన్నాడ వద్ద ఒక వాహనాన్ని నిలుపుదల చేసే క్రమంలో ఆ వాహనదారుడు ఆ వెహికల్‌ను అక్కడ ఉన్న షాపుల మధ్యకు తీసుకువెళ్లి నిలిపాడు. అధికారుల ఆదేశంతో హోంగార్డు వెళ్లి వాహనాన్ని తనిఖీ చేసి తిరిగి వస్తుండగా అక్కడే ఉన్న జనసేన పార్టీ నేత కునుకు రామకృష్ణ ఆవేశంగా వీడియోలు తీస్తూ ఇన్‌స్పెక్టర్లపైకి దూసుకువచ్చి అక్కడ ఉన్న కొందరు దగ్గర్నుంచి రూ. 3 వేలు లంచం తీసుకున్నారని ఆరోపణలు చేయిస్తూ గతంలో తన వాహనానికి వేసిన జరిమానాపై ఆగ్రహం వ్యక్తం చేశాడన్నారు. రామకృష్ణ గతంలో కూడా ఒక టోల్‌ప్లాజా వద్ద కారు ఆపినందుకు సిబ్బందిపై వాగ్వివాదానికి దిగి ప్రభుత్వాన్ని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడన్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ కావడం కోసం విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై రామకృష్ణ దురుసు ప్రవర్తనను ఖండిస్తున్నామన్నారు. ఏఎంవీ రవి మాట్లాడుతూ మద్యం సేవించి ఉన్న జనసేన నాయకుడు కునుకు రామకృష్ణ తీవ్ర ఆవేశంతో వీడియోలు రికార్డు చేస్తూ గతంలో వాహనానికి విధించిన ఫైన్‌పై తనను నిలదీశాడన్నారు. తన మనుషులతో రూ.3 వేలు లంచం తీసుకున్నామని చెప్పించి వీడియోలు రికార్డు చేసి భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. ఏఎంవీఐ లక్ష్మి మాట్లాడుతూ జనసేన నాయకుడు రామకృష్ణ తీరుతో భయాందోళనతో కారులోనే ఉండిపోయానన్నారు. ఎంవీఐలు డీవీ రమణ, కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు

దేశ భవిష్యత్ నిర్ణయించేది ప్రయోగాలే

తాడేపల్లిగూడెం: జీవకణాలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ఎస్ఎన్ బోస్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ (కోల్‌కత) శాస్త్రవేత్త డాక్టర్ ఆయాత్తి మల్లిక్‌గుప్తా అన్నారు. ఏపీ నిట్‌లో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇన్‌సిలికో మాక్రోమోలక్యులర్ మోడలింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్ అనే అంశంపై సాగుతున్న వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఔషధాల తయారీ విధివిధానాలు, డిజైన్ పద్ధతులు, అవి ఎంత పరిమాణంలో ఉండాలి అనే అంశాలపై గుప్తా వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న 60 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సుదర్శన్‌దీప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, శ్రీనివాసన్ పాల్గొన్నారు.


నిట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు, అతిథులు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పరిశ్రమల్లో రసాయన ప్రమాదాల నివారణకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా క్రైసెస్ టీమ్‌తో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రసాయన ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అత్యవసర ప్రణాళికను రూపొందించాలన్నారు. పరిశ్రమలను తనిఖీ చేసి లోటుపాటులపై నోటీసులను అందజేయాలన్నారు. జిల్లాలోని 48 పరిశ్రమల్లో ప్రమాద స్థాయిని కేటగిరీల వారిగా విభజించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. వీటితోపాటు కార్మిక శాఖ రిజిస్ట్రేషన్ చేసినవి, అమోనియా, క్లోరిన్ వినియోగించేవి, గేయిల్, ఓఎన్ జీసి పైప్ లైన్లు వెళ్లే ప్రాంతాలను గుర్తించి ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరిశ్రమలలో ప్రమాదాలు నివారణకు చర్యలను చేపట్టాలని ఆదేశించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆదిశేషు, డీఎంహెచ్వో డి.మహేశ్వరరావు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

విశ్వకర్మ యోజన పథకానికి 11,131 దరఖాస్తులు

అనంతరం పీఎం విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షిస్తూ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో చేతి వృత్తిదారులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు 11,131 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీటిలో తొలి దశలో 2,978 దరఖాస్తులు వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలినవి గ్రామపంచాయతీ, యు ఎల్ బి స్థాయిలో వెరిఫికేషన్ పూర్తి కావాల్సి ఉందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని వివిధ లేఅవుట్‌లలోని ఇళ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన మండలాల్లో చిన్న చిన్న లే అవుట్లలో ప్రగతి లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాటికి ప్రగతి చూపకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ నిర్మాణాలను పూర్తి చేసినప్పుడే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి రోజు ఈ విధులు నిర్వహించాలన్నారు. నిర్మాణం తుదిదవశలో ఉన్న ఇళ్లల్లో చిన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని లేఅవుట్ల రహదారులలో రాకపోకలకు అనుగుణంగా శిథిలాల మట్టిని తోలించాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ఆర్సీ ఆనంద్ కుమార్, ఈఈ బి.వెంకట రమణ, డీఈలు జి.పిచ్చయ్య, పి.శివరామరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలి

తాడేపల్లిగూడెం: మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి అన్నారు. మంగళవారం ఉద్యాన కళాశాలలో చాక్లెట్ తయారీ, మార్కెటింగ్ పరపతి గురించి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఐసీఏఆర్ సబ్‌ప్లాన్ కింద ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ పర్యవేక్షణలో శిక్షణ సాగింది. మాధవి మాట్లాడుతూ స్త్రీలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతి పథంలో ఉంటుందన్నారు. మహిళలు ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఆదాయం పొందాలన్నారు. చాక్లెట్ తయారీకి అన్ని రకాల సాయాలను అందిస్తామన్నారు. ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.కల్పన , ఆర్‌వీ సుజాత, ఎ.చాందిని, టి.రవికిరణ్ సహాయ సహకారాలను అందించారు. తాడేపల్లిగూడెం ఉద్యాన అధికారి శ్రీలక్ష్మీ, డీఆర్‌డీఏ ఏపీఎం లక్ష్మీ, వీహెచ్ఏ లోకేశ్వరి, ఉదయ్ నాగరాజు పాల్గొన్నారు. శిక్షణలో తాడేపల్లిగూడెం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వెంకట్రామన్నగూడెం గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయానికి కుర్చీల బహూకరణ



పరిమెళ్ల సచివాలయానికి కుర్చీలు బహూకరించిన దాతలు

పెంటపాడు: సచివాలయాల వ్యవస్థ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందుతోందని పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు పేర్కొన్నారు. పరిమెళ్ల గ్రామ సచివాలయానికి, ఆర్బీకే సెంటర్‌కు గ్రామానికి చెందిన దాతలు మండా శివరామ కృష్ణ, ప్రవల్లిక దంపతులు 20 కుర్చీలు బహూకరించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు మండా కన్నయ్య, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మండా జయరాజు, గణక్షిత్, యానాలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాడి కృష్ణ, వ్యవసాయ సలహామండలి సభ్యులు తాడి భాస్కరరావు, గ్రామ ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, రైతులు తంగెళ్ల సూరి పాల్గొన్నారు.

స్కేటింగ్ హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన క్రీడాకారులు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ 35వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ 2023లో భాగంగా నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్థానిక మాంటిస్సోరీ పాఠశాల డైరెక్టర్ ఎ.ప్రకాశరావు తెలిపారు. స్థానిక స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో క్వాడ్ హాకీ జూనియర్ బాలుర విభాగంలో విద్యార్థి ఎం.ఓంకార్ బంగారు, ఇన్‌లైన్ హాకీ కేడెట్ బాలికల విభాగంలో మోయిత్రి దాస్ వెండి పతకం, క్వాడ్ హాకీ జూనియర్ బాలికల విభాగంలో పి.అమూల్య కాంస్య పతకం, మిక్స్‌డ్ గ్రూపులో వెండి పతకం, సబ్ జూనియర్స్ హాకీ విభాగంలో 7గురు విద్యార్థులు వెండి పతకాలు, కేడెట్ హాకీ బాలుర విభాగంలో 8 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

దుకాణాల్లో సోదాలు



ప్లాస్టిక్ కవర్ల వాడకంపై దుకాణాలలో సోదాలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాడేపల్లిగూడెం: పట్టణంలోని దుకాణాలలో మంగళవారం మున్సిపల్ అధికారులు సోదాలు చేశారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణాల్లో వాటిని గమనించి అపరాధ రుసుములు విధించారు. 26 దుకాణాల నుంచి 22 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని, 17,200 రూపాయలను అపరాధరుసుంగా వసూలు చేశారు. ఈ దాడుల్లో శానిటరీ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి



తాడేపల్లిగూడెంలో చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదిన హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ విస్సంపల్లి సిద్ధూ పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యుడు తెన్నేటి జగజ్జీవన్, లంకా రాజశేఖర్, దూలపల్లి శ్రీనివాసరావు, దేవతల శివాజీ, జుజ్జువరపు వాసుచౌదరి, బి.రత్నాజీ, చిన్ని, చెప్పుల వాసు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అలంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో గాంధీబొమ్మ సెంటర్‌లో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ క్యాంప్‌ను ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారన్నారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం పట్టణం నుంచి ర్యాలీగా మార్కెట్ యార్డుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలోనే పార్టీ శ్రేణులు మార్పు చెందాలన్నారు. రానున్న కాలంలో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం మండలంలోని పడాల మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏడీఏ పి.మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలను క్రమశిక్షణతో అమలు చేయాలన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తిచేసుకోవడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు సెటిల్మెంట్ నాయకులను కోరుకోవడం లేదన్నారు. వారిని దూరం పెడుతున్నామన్నారు. మనల్ని అనుసరించే విధంగా ముందుకెళ్తున్నామన్నారు. దేవాదాయ శాఖలో అవినీతికి తావు లేకుండా తీసుకుంటున్న నిర్ణయాలను సీఎం మెచ్చుకుంటున్నారన్నారు. దైవం, దేవాదాయ శాఖపై విశ్వాసంతో ఉన్న వ్యక్తి జగన్‌అని కొనియాడారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన పాలకవర్గంతో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ చైర్మన్‌గా చోడగిరి సత్యనారాయణ (చినబాబు), మరో 17మంది సభ్యులుగా ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గం రైతాంగ సమస్యలపై దృష్టి సారించి, ముందుకు సాగాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సూచించారు. తొలుత తాడేపల్లిగూడెం పట్టణం నుంచి మోటారుసైకిళ్ల ర్యాలీగా మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, వరలక్ష్మి, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సీజీఎఫ్ కమిటి సభ్యుడు కర్రి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గుండుబోగుల నాగు, పెంటపాడు మండల పార్టీ గౌరవాధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, సచివాలయ కన్వీనర్ మైలవరపు పెదబాబు, నాయకులు కొట్టు విశాల్, ధనలక్ష్మి, ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు రెడ్డి), కట్టు బోయిన కృష్ణప్రసాద్, చెన్నా జనార్ధన్, కర్నాటి కన్నయ్య, ధర్మరాజు, సంపతరావు కృష్ణారావు, ఏఎంసీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి ఎంవీఎస్.ప్రభాకర్, మండల వ్యవసాయాధికారులు ఆర్ఎస్.ప్రసాద్, కే.పార్ధసారథి, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, గుమ్మళ్ళ తాతారావు, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌కు వివరాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల విద్యా సంచాలకులు డాక్టర్ సీహెచ్ కృష్ణ

తణుకు టౌన్: ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల వివరాలు అందించడం ద్వారా ఎన్ని పని గంటలు భారం ఉందో తెలుసుకుని అధ్యాపక పోస్టులు భర్తీ ఉంటుందని కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ కృష్ణ చెప్పారు. మంగళవారం తణుకులోని ఎస్కేఎస్‌డీ (?) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తణుకు ఎస్ఆర్‌సీ పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. ఎన్ని పని గంటల భారం ఉందో తెలుసుకొని పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. దీని ఆధారంగానే రేషనలైజేషన్ జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తణుకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్‌తో పాటు వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారత పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సంకు మనోరమ

తణుకు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వచ్చే 2024 లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేసి మహిళల సాధికారత పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని జిల్లా మహిళా సదస్సు డిమాండ్ చేసింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, మహిళా సాధికారత అనే అంశంపై మంగళవారం స్థానిక సురాజ్యభవన్‌లో సదస్సు నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారిణి సంకు మనోరమ, తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వంక వసుంధర పాల్గొని మాట్లాడారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత తమ లక్ష్యమని చెబుతూ అందుకే మహిళా బిల్లు ఆమోదించామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకు ఎవ్వరు అడ్డు నిలిచారో చెప్పాలన్నారు. అన్ని పార్టీల ఆమోదంతో చట్టం రూపం దాల్చిన చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తక్షణ అమలుకు పూనుకోవాలని కోరారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ ఈనెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర మహసభలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు సల్మా, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు సావరపు దేవి, సహాయ కార్యదర్శి ఉల్లింకల నాగలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగారాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లల అభివృద్ధికి కృషి చేద్దాం



భవిత సెంటర్‌లో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటుగా తల్లిదండ్రులు కృషి కూడా చాలా అవసరమని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. పట్టణంలోని మంగళవారం దివ్యాంగుల పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. ఇంటి వద్ద దివ్యాంగుల పిల్లలకు తల్లిదండ్రులు చేయాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపై అవగాహన చేశారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలు దైవస్వరూపాలని, వారిని ప్రతి ఒక్కరూ ప్రమతో ఆదరించాలని, వారి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ప్రజ్ఞా లోపం ఉన్న పిల్లలకు వారి సామర్థ్యాలు అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ, బోధన సామాగ్రి, అవగాహన చేస్తున్నట్లు చెప్పారు. మరో ప్రత్యేక ఉపాధ్యాయిని చంద్రకుమారి, సుబ్బారావుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోతిలు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక ఉపకరణాలు అందిస్తున్నట్లు చెప్పారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ):పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు కోరారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు రూపకల్పన చేసినట్లు, చిన్నారులకు వివిధ అంశాలపై పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతి ప్రధానోత్స వాలు ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులు తమ తమ పిల్లలను గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొనే విధంగా చూడాలని కోరారు.

అత్తిలి: ఈనెల 14నుంచి 20వరకు అత్తిలి శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు బైపు కృష్ణాజీ, గారపాటి నాగరాజు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా సామాజిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, ఐసీడీఎస్ ప్రాజెక్టు తాడేపల్లిగూడెం పరిధిలో అంగన్‌వాడీ సహాయకులుగా మహిళా పోస్టులకుగాను అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మంగళవారం వాటి వివరాలను సీడీపీఓ వెల్లడించారు. టౌన్‌లో 10వ వార్డు-1లో ఎస్టీ అభ్యర్థి, 16వ వార్డు3లో బీసీ-డి, 18వ వార్డు-1లో వీహెచ్ ఓపెన్ కేటగిరి (పరిమితికి లోబడి దృష్టిలోపం) ఉన్నవారు, 20వ వార్-3లో ఓపెన్ కేటగిరి, 31వ వార్డు-2లో ఎస్సీ, అదే విధంగా మండలంలోని కొమ్ముగూడెం-1లో బీసీ-స్త్రీలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ ఖ్యాళీలు కోసం పెంటపాడు మండలంలోని మౌంజిపాడు-1లో వీహెచ్ ఓపెన్ కేటగిరి (పరిమితికి లోబడి దృష్టిలోపం) ఉన్నవారు, గూడెం మండలంలోని బంగారు గూడెం-1లో ఎస్సీకు అర్హత ఉందన్నారు. అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం కాంపౌండ్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో అందజేయాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన టిప్పర్ ముందు భాగం

తణుకు: పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానిక పాత టోల్‌గేట్ సమీపంలోని జాతీయ రహదారి నిర్వహణ పనులు నిమిత్తం రోడ్డుపై లారీను నిలిపారు. ఈ సమయంలో రావులపాలెం వైపు నుంచి వస్తున్న టిప్పర్ వాహనం లారీను వెనుక నుంచి ఢీ కొట్టింది. వేగం ధాటికి లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుణ్ని చికిత్స నిమిత్తం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు వాహనం వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేసిన వ్యాన్‌ను ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న వేలం వేస్తున్నట్లు ఎస్సై నాగబాబు మంగళవారం చెప్పారు. వేలం పాటలో పాల్గొనేవారు నిబంధనలు పాటించాలని సూచించారు.

రోడ్డుకిరువైపులా ఒకేసారి స్ప్రే



దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రోడ్డుకిరువైపులా ఒకేసారి దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద బెల్ మిస్టర్ జంబో స్ప్రేయర్‌తో దోమల నివారణమందు పిచికారి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ బెల్‌మిస్టర్ యంత్రానికి అదనంగా మరో రెండు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వారం రోజుల్లో అవి కూడా వస్తాయన్నారు. వన్ టౌన్‌లో రెండు, టూ టౌన్‌లో ఒకటి చొప్పున ప్రతి నిత్యం ఫాగింగ్ చేసి, దోమలను నివారించాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్, సీజీఎఫ్ కమిటి సభ్యుడు కర్రి భాస్కరరావు, నాయకులు తెన్నేటి జగజ్జీవన్, బొద్దాని శ్రీనివాస్, బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై మహిళలకు అవగాహన



తాగునీటిని శుద్ధి చేయు విధానాన్ని పరిశీలిస్తున్న డ్వాక్రా మహిళలు

తాడేపల్లిగూడెం అర్బన్: దీన్ దయాళ్ అంత్యోదయ-జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక పంపుల చెరువు వద్ద నీటి శుద్ధి విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఇంజనీర్ డి మురళీకృష్ణ మాట్లాడుతూ నీటి శుభ్రత విధానం, నీటి వినియోగం, స్వయం సహాయక సభ్యులకు అవగాహన కలిప్తామన్నారు. నీరు ఏవిధంగా నిల్వ చేసి, శుభ్రం చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం బిహెచ్ శ్రీనివాస్, డ్వాక్రా సంఘాల అధ్యక్షురాలు బోళం రామలక్ష్మి, సిఓలు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీలు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో సామాజిక తనిఖీలు

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏప్రిల్ 2022 సంవత్సరం నుంచి మార్చి 2023 వరకు జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళవారం డ్వామా పీడీ రాజేశ్వరరావు తనిఖీ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డ్వామా పీడీ రాజేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా మండలంలో పెద్ద ఎత్తున ఉపాధి పనులు జరిగాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1,507 పనులకు గాను రూ.4కోట్ల 57 లక్షల 10వేల 225 వేతనాలు, రూ. 3కోట్ల 2 లక్షల 18 వేల 136 మెటీరియల్ పేమెంట్స్ కలిపి రూ 7 కోట్ల 59 లక్షల 28 వేల 361 విలువ గల పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో రికవరీ రూ. 2,335 , అపరాధ రుసుం రూ.1000 కలిపి 4వేల 510 వేతనదారులకు చెల్లించాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఎ విజయ లక్ష్మీ ,ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి సంక్షేమ బోర్డుల ప్రదర్శన

తాడేపల్లిగూడెం అర్బన్ : ఈనెల 9వతేదీ నుంచి 23వ తేదీ వరకు వార్డుల్లోని సచివాలయాల వద్ద సంక్షేమ బోర్డుల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వార్డుల వారీ తేదీలు, ప్రదర్శన కార్యక్రమాలను వెల్లడించారు. 9న రైల్వే స్టేషన్ రోడ్డులోని సచివాలయం వద్ద, 10న శేషమహల్ థియేటర్ వద్ద 1- సచివాలయాల వద్ద సంక్షేమ బోర్డులు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారన్నారు.

మోడల్ పాఠశాలగా తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్

- సీబీఎస్ఈ, పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ సదుపాయాలు అందుబాటులోకి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో ఎంతో మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్ది డాక్టర్లు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ ఉద్యోగులుగా ఉన్నత స్థాయికి ఎదిగేలా చేసిన తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వ గుర్తింపునకు నోచుకుంది. తణుకు పరిసర ప్రాంతంలోని పాఠశాలల్లో కంటే అధిక విద్యార్థుల సంఖ్యతో పాటు పాఠశాలలో ఉన్న వనరులకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే అమలవుతున్న సీబీఎస్ఈ సిలబస్, ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ) సదుపాయాలకు ఈ పాఠశాల ఎంపికైంది. దీంతో ఈ పాఠశాల తణుకు పరిసర ప్రాంతాలకు ఒక మోడల్ పాఠశాలగా మారనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలను నాడు -నేడు పనుల్లో భాగంగా అత్యధికంగా రూ. 3.50 కోట్లు వెచ్చించి అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు, అధునాతన టాయిలెట్స్, సురక్షిత తాగునీరు సౌకర్యాలను కల్పించింది. ఇటువంటి సౌకర్యాలు కలిగి ఉండడంతో ఈ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

సీబీఎస్ఈ..

ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే అమలవుతున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్ తాజాగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లోని 9వ తరగతి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. దేశమంతా ఒకే సిలబస్‌గా ఉండే సీబీఎస్ఈ సిలబస్ కోసం ప్రైవేటు విద్యాసంస్థల్లో పోటీతత్వం ఉంటుంది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో కూడా అందుబాటులోకి రావడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లి తండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 9వ తరగతిలో అత్యధికంగా 375 మంది విద్యార్థులు ఉండడంతోపాటు పాఠశాలలో ఉన్న వనరులను సమీకరించుకుని సీబీఎస్ఈకి పాఠశాల ఎంపికైనట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా)..

పాఠశాలల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 1400 పాఠశాలలను ఎంపిక చేయగా అందులో తణుకు జెడ్పీ పాఠశాల కూడా చోటు దక్కించుకోవడం ఈ పాఠశాల సామర్థ్యం ఇక్కడ ఉన్న వనరులే నిదర్శనం. ఈ పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ ద్వారా ప్రత్యేక నిధులు పాఠశాలలకు మంజూరు చేసి అవసరమైన వనరులన్నీ కల్పించి మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన వనరులు ఉండడంతో జూవాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ల్యాబ్‌లను పూర్తిగా అత్యాధునిక పరికరాలతో ముస్తాబు చేస్తారని, సాంకేతికంగా విద్యార్థులకు ఏ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందో గుర్తించి సదరు వనరులన్నీ కల్పిస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎస్‌హెచ్‌ఆర్ఐగా ఎంపిక గర్వకారణం



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ పాఠశాలగా ఎంపికచేయడం గర్వంగా ఉంది. విద్యార్థులకు అవసరమైన ఆధునిక బోధనా శిక్షణకు అవసరమయ్యే సదుపాయాలన్ని అందుబాటులోకి వస్తాయి. సీబీఎస్ఈ పరంగా కూడా విద్యార్థులకు మంచి అవకాశం. ప్రైవేటు పాఠశాలల్లో అధిక రుసుంలు చెల్లించి తమ పిల్లలకు సీబీఎస్ఈ బోధన చేయిస్తున్న నేటి రోజుల్లో ప్రభుత్వ పాఠశాలకు ఈ సదవకాశం రావడం అభినందనీయం.

– కె.పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు–

మంత్రి కారుమూరి చొరవతో



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్న ప్రాధాన్యతతో రాష్ట్ర పౌరసర ఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు నాడు నేడు పనుల్లో భాగంగా రెండు దశల్లో మొత్తం రూ. 3.50 కోట్లు నిధులు మంజూరు చేయించి పాఠశాల రూపురేఖలే మార్చేశారు. ఆ సౌకర్యాల ఫలితమే నేడు కేంద్ర ప్రభుత్వం సీబీఎస్ఈ, పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ సదుపాయాలు వచ్చాయి.

– మురాల సుధాకర్, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, తణుకు–

చరిత్ర కలిగిన పాఠశాల



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌కు ఎంతో చరిత్ర ఉంది. భూమిపరంగా దాతలు అందించిన సహకారంతో భవనాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రభుత్వం మంచి మౌలిక వనరులు కల్పించింది. నేను ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశాను. నాతోపాటు తణుకులో ప్రాక్టీస్ చేస్తున్న ప్రముఖ వైద్యులు కూడా ఇక్కడే విద్యాభ్యాసం చేశారు. వారే కాకుండా చాలా మంది విదేశాల్లో మంచి ఉన్నతస్థాయిలో ఉన్నారు. అటువంటి పాఠశాలకు సదుపాయాలు కలుగచేయడం అభినందనీయం.

– డాక్టర్ నుంకవల్లి రామకృష్ణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెంటపాడు: ఈనెల 22న ఉదయం 10 గంటలకు పెంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

'ఆసక్తి ఉంటే అనంత విశ్వాన్ని మథించవచ్చు' అనడానికి ప్రతీక శకుంతలాదేవి. అరవై దాటిన తర్వాత యూ ట్యూబర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యారు. అంతకంటే ముందు ఆమె తనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్నారు. ఆ ప్రపంచంలో సంగీతం, సాహిత్యం, మొక్కల పెంపకం ఉన్నాయి. ఇప్పుడు డిజిటల్ మీడియా వేదికగా సృజనాత్మకతను పంచుతున్నారు. భర్త బాటలో తాను కూడా మరణానంతరం దేహాన్ని డొనేట్ చేశారు.

అర్థవంతమైన జీవితం


శకుంతలాదేవి

శకుంతలాదేవి అత్యంత సాధారణ గృహిణి. నలుగురు పిల్లల్ని పెంచుతూ ఆమె తన అభిరుచులను కొనసాగించారు. సాహిత్యాన్ని ఆస్వాదించకుండా ఉట్టిగా పాటలు వినడంలో ఏదో అసంతృప్తి. అందుకే హిందీ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి హిందీ– తెలుగు డిక్షనరీలో అర్థాలు వెతుక్కున్నారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాలను ఉబుసుపోని పోస్టులకు పరిమితం చేయలేదామె. సాంకేతిక పాఠాలను స్మార్ట్‌ఫోన్‌తోనే నేర్చుకున్నారు. వీడియో రికార్డ్ చేయడం, ఎడిటింగ్, థంబ్‌నెయిల్ పెట్టడం, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం వరకు అవసరమైనవి అన్నీ సొంతంగా నేర్చుకున్నారు. తనకు తెలిసిన మంచి విషయాలను డిజిటల్ మీడియా వేదికగా ప్రపంచంతో పంచుకుంటున్నారు. 'నన్ను ప్రపంచానికి తెలియ చేసిన యూట్యూబ్‌కి తొలుత కృతజ్ఞతలు' అంటూ తన వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు స్వర్ణ శకుంతలాదేవి.

ఆధ్యాత్మికం నుంచి అభ్యుదయం వరకు ...

''మాది తెనాలి దగ్గర మూల్పూరు గ్రామం. నాన్న వ్యవసాయంతోపాటు గుడిలో పూజలు చేసేవారు. ఏడుగురు సంతానం. ఐదుగురు అమ్మాయిల్లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివింది నేనే. మా వారు బీఏఎమ్ఎస్ చదువుతూ ఉండడంతో ఆయన చదువు పూర్తయ్యే వరకు, నాకూ చదువుకునే అవకాశం వచ్చింది. ఫిఫ్త్‌ఫారమ్‌లో ఉండగా పెళ్లయింది. తర్వాత పుట్టింట్లోనే ఉండి ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి రిజల్ట్స్ వచ్చే నాటికి చీరాలలో అత్తగారింటిలో ఉన్నాను. అప్పట్లో ఆ చదువుకే సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం ఇచ్చేవారు. మా అత్తగారు 'ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముందిప్పుడు' అనడంతో ఇంటికే పరిమితమయ్యాను. టీచర్ అయ్యే అవకాశం అలా చేజారింది. కానీ మా వారి నుంచి ప్రోత్సాహం మాత్రం ఎప్పుడూ ఉండేది. ఆయన ఆయుర్వేద వైద్యులుగా ఒంగోలు దగ్గర అమ్మనబ్రోలులో ప్రాక్టీస్ చేసేవారు. అక్కడే 35 ఏళ్ల పాటు ఉన్నాం. ఇద్దరు పిల్లలు పుట్టిన తరవాత వీణ నేర్చుకున్నాను. ఆ తర్వాత మరో ఇద్దరు పిల్లలు. వాళ్లందరి ఆలనపాలన చూస్తూనా అభిరుచులను కొనసాగించగలిగాను. ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి రంగనాయకమ్మ రాసిన బలిపీఠం, కౌసల్యాదేవి– చక్రవాకం, రవీంద్రనాథుని గీతాంజలి, బాలగంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి.. ఇలా అదీ ఇదీ అనే వర్గీకరణ లేకుండా చదివేదాన్ని. యద్దనపూడి, మాదిరెడ్డి, యండమూరి, శ్రీశ్రీ రచనలను, అబ్దుల్‌కలామ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను ఇష్టంగా చదివాను. కొన్ని రచనలు రేడియోలో నాటికలుగా వచ్చేవి. వాటి కోసం రేడియోకి అంకితమయ్యేదాన్ని. ఇలా సాగుతున్న జీవితంలో పిల్లలు నలుగురూ సెటిల్ అయిన తర్వాత మా వారు ప్రాక్టీస్ చాలించారు. 2005లో చీరాలకు వచ్చాం.

పెద్దబ్బాయి కొత్తదారిలో నడిపించాడు

మా పెద్దబ్బాయి నన్ను కొత్తగా ఆవిష్కరించాడు. తను మెకానికల్ ఇంజనీర్. తాను ఆసక్తి కొద్దీ జెమాలజీ కోర్సు చేశాడు. రత్నాల గురించిన కబుర్లు నాకు ఎక్కువ ఆసక్తినివ్వడంతో రత్నాలకు – రాళ్లకు మధ్య తేడాను గుర్తించడం నేర్పించాడు. ముత్యాలు, పగడాలతోపాటు రకరకాల బీడ్స్, జెమ్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్‌తో ఆర్నమెంట్ మేకింగ్ నేర్పించాడు. జీవితాన్ని మనం ఎంత ఉత్సాహవంతంగా, రాగరంజితంగా మార్చుకున్నప్పటికీ ఏదో ఒక వెలితిని సృష్టించి ప్రశ్నార్థకంగా మన ముందు పెడుతుంది. నా అభిరుచులు మాత్రమే నాతో మిగిలాయి, వాటిని ప్రోత్సహించిన మావారు మాకు దూరమయ్యారు. ఆయన కోరిక మేరకు దేహాన్ని వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఒంగోలులో మెడికల్ కాలేజీకి ప్రదానం చేశాం. ఆయన బాటలో నేను కూడా మరణానంతరం నా దేహాన్ని డొనేట్ చేస్తూ సంతకం చేశాను. మనం జీవిస్తూ మరొకరికి ఉపయోగం కలిగించడమే జీవితానికి అసలైన అర్థం అని నమ్ముతాను. ఆయన జ్ఞాపకాలతో రోజులు సాగుతున్న సమయంలో కోవిడ్ ప్రపంచాన్ని కుదిపేసింది.

యూ ట్యూబ్ ఆత్మీయులనిచ్చింది

కోవిడ్ సమయంలో అగాధంలాంటి విరామం. ఆ విరామం ఎంత కాలమో కూడా తెలియదు. యూ ట్యూబ్ చానెల్స్ చూస్తూ, మా వారు సుబ్రహ్మణ్య కుమార్ రాసిన వైద్య గ్రంథాన్ని చదువుతూ గడిపాను. అప్పుడు నాక్కూడా నాకు తెలిసిన సంగతులు చెప్పాలనిపించింది. గూగుల్ లేని రోజుల్లోనే నిత్యాన్వేషిగా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత ఇక కష్టమేముంది? యూ ట్యూబ్‌కి సంబంధించిన పరిజ్ఞానమంతా 'హౌ టూ అప్‌లోడ్, హౌ టూ డూ ఎడిటింగ్, హౌ టూ డూ థంబ్‌నెయిల్' అంటూ 'హౌ టూ' అని అడుగుతూ నేర్చుకున్నాను. మొదట వంటలు, ఇంటి అలంకరణ, మా వారు రాసిన వైద్యగ్రంథంలోని విషయాలను చెప్పాలనుకుని 2021లో యూ ట్యూబ్ చానెల్ మొదలుపెట్టాను. కొంతకాలం తర్వాత యూ ట్యూబ్ గుర్తించాలంటే ఏదో ఒక టాపిక్ మీదనే దృష్టి పెట్టమని సూచించారు పిల్లలు. వంటలు చాలామంది చేస్తున్నారు. ముత్యాలు, పగడాల గురించి చాలామందికి తెలియని సంగతులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పమన్నారు మా పిల్లలు. ఆ తర్వాత నాకు సబ్‌స్క్రైబర్స్ రెండున్నర లక్షలకు పెరగడంతోపాటు ఫాన్ ఫాలోయింగ్ కూడా పెరిగింది. డాక్టర్‌లు, సైంటిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు... సందేహాలడుగుతుంటే నాకు తెలిసినదెంత? ఇంత పెద్ద చదువులు చదువుకున్న వాళ్ల సందేహాలు నేను తీర్చడమేమిటని ఆశ్చర్యంగా ఉంటుంది కూడా. అసలు ముత్యాన్ని, నకిలీ ముత్యాన్ని ఎలా గుర్తించాలి, తైవాన్ పగడం ఎలా ఉంటుంది, ఇటాలియన్ పగడాలెలా ఉంటాయి, వేటిని క్యారట్‌లలో తూస్తారు, వేటిని గ్రాముల్లో తూస్తారు... వంటి విషయాలనెన్నో చెప్పాను. యూ ట్యూబర్‌గా నేను డబ్బుకంటే వెలకట్టలేని ఆత్మీయతను, అభిమానాన్ని సంపాదించుకున్నాను. ఆంటీ, అమ్మా అనే పిలుపులతోపాటు ఈ తరం యువతులు వాళ్ల సందేహాల కోసం ఫోన్ చేసి 'అమ్మమ్మా' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటోంది. మనిషి, మెదడు పని లేకుండా ఖాళీగా ఉండకూడదు. అలాగే ఎంటర్‌టైన్‌మెంట్ మన మైండ్‌ని చెడగొట్టకూడదని నమ్ముతాను. అందుకే టీవీ సీరియల్స్ నన్ను ఆకర్షించలేదు. నాకు నేనుగా సమయాన్ని ఇలా ఆనందంగా, ఉపయుక్తంగా మలుచుకున్నాను'' అన్నారు శకుంతలాదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళ

ఆర్ట్ సైంటిస్ట్

ఆర్ట్, ఫ్యాషన్‌ను కలిపి తనదైన కళను ఆవిష్కరించింది ఢిల్లీకి చెందిన **పాయల్ జైన్.**

ఫ్యాషన్ రంగంలో పేరుగాంచిన పాయల్ జైన్ మంచి ఆర్టిస్ట్ కూడా.

ఆమె తాజా ఎగ్జిబిషన్....సోల్ ఆఫ్ ఏ ఉమెన్.

ఎగ్జిబిషన్‌లో కనిపించే 30 పీస్‌లలో ప్రతి దాంట్లో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. చరిత్ర నుంచి కవిత్వం వరకు ఏదో ఒక అంశ ధ్వనిస్తుంది.

'ఆర్ట్‌లో సైన్స్ ఉంటుంది. సైన్స్‌లో ఆర్ట్ ఉంటుంది' అనే పాయల్ జైన్‌ను ఆర్ట్ సైంటిస్ట్‌గా పిలుచుకోవచ్చు.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో తన మూడు దశాబ్దాల ప్రయాణానికి 'సోల్ ఆఫ్ ఏ ఉమెన్' ప్రతిబింబం అంటుంది పాయల్. ఈ ఎగ్జిబిషన్‌లోని ముప్పై పీస్‌లలో ప్రతి పీస్‌కు ఏదో ఒక ప్రత్యేకత ఉంది. మెక్సికన్ పెయింటర్ ఫ్రీదా ఖాలోను స్ఫూర్తిగా తీసుకొని 'ఫర్‌బిడెన్ లవ్' కలెక్షన్ రూపొందించింది. పాయల్ అభిమానించే ఖాలో పెయింటర్, మ్యాజికల్ సర్రియలిస్ట్, ఫెమినిస్ట్, రెవల్యూషనరీ.

పాయల్ ఆర్కిటెక్చర్ నుంచి ఫ్యాషన్ రంగంలోకి రావడానికి కారణం చిత్రకళ పట్ల తనకు ఉన్న అనురక్తి. స్కెచ్చింగ్ తనకు ఇష్టమైన పని. ఆమె తల్లి కూడా ఆర్టిస్టే. సితార్ అద్భుతంగా వాయించేది. తన కలల గురించి తల్లిదండ్రులకు చెప్పినప్పుడు ' ఏదో ఒక డిగ్రీ నీ చేతిలో కనిపించాలి. ఆ తరువాతే ఏదైనా' అన్నారు. అలా బీకామ్ పూర్తి చేసింది.




సోల్ ఆఫ్ ఏ ఉమెన్

పాయల్ స్కెచ్చింగ్ నైపుణ్యాన్ని చూసి 'నువ్వు ఫ్యాషన్ ఇండస్ట్రీలో ప్రయత్నించవచ్చు' అని సలహా ఇచ్చారు సన్నిహితులు. మొదట ఫ్యాషన్ ఇండస్ట్రీకి సంబంధించి పుస్తకాలు, మ్యాగజైన్స్ విరివిగా చదివేది. అలా ఫ్యాషన్ కూడా తన ప్యాషన్‌గా మారింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది.

'ఫ్యాషన్‌కు ఆర్ట్, సైన్స్ అనే రెండు కోణాలు ఉంటాయి. ఆర్ట్ అనేది సృజనాత్మకతకు సంబంధించిన కోణం, సైన్స్ అనేది సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన కోణం. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ నా దృష్టిని విశాలం చేసింది. ప్యాటర్న్‌మేకింగ్, డ్రాపింగ్, గ్రేడింగ్, ఇలస్ట్రేషన్, ఫ్యాషన్ మార్కెటింగ్...ఇలా ఎన్నో విషయాలను తెలుసుకున్నాను' అంటున్న పాయల్ ఎన్నో కార్పొరేట్ హోటల్స్‌కు ఆకట్టుకునేలా 'హోటల్ యూనిఫామ్'ను డిజైన్ చేసి ఇచ్చింది.

'డిజైనర్స్ అంటే గొప్ప ఏమీ కాదు. గ్లోరిఫైడ్ టైలర్స్ మాత్రమే' అని చాలామంది అనుకొని అపోహపడే కాలంలో డిజైనర్‌గా కెరీర్ ప్రారంభించింది పాయల్. ఆమె వెస్ట్రన్ క్లాతింగ్ మొదలుపెట్టినప్పుడు దానికి మార్కెట్ లేదు. అయితే ఆ తరువాత మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చింది.

పాయల్ సక్సెస్ మంత్రా ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

'చేయాలి కాబట్టి చేస్తున్నాం అనే ధోరణిలో కాకుండా మనం చేస్తున్న పనిని మనసారా ప్రేమించాలి. నిద్ర, శ్వాస, కలలో మన లక్ష్యం కనిపించాలి. ఫెయిల్యూర్‌కు చోటివ్వకుండా సాంకేతిక జ్ఞానంపై గట్టి పట్టు సంపాదించాలి. ఎప్పటికప్పుడు మన ఆలోచనల్లో కొత్తదనం వచ్చేలా చూసుకోవాలి. ప్రశంసలు ఆస్వాదించడానికి మాత్రమే పరిమితమైపోకుండా అన్ని కోణాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. మార్పులు చేర్పులు చేసుకోవాలి. సానుకూల శక్తి, సంకల్పబలం ఎప్పటికీ మనకు తోడుగా ఉండాలి'

కెరీర్ తొలి రోజుల్లో తాను ఎదుర్కొన్న ఆటుపోట్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది పాయల్. చేదుజ్ఞాపకాలుగా కాదు...ఆ సమయంలోనూ తాను ఎంత ధైర్యంగా ఉందో మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చుకోవడానికి.

'విజయం ధైర్యవంతులను వెదుక్కుంటూ వస్తుంది' అని చెప్పడానికి ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఆమె తెచ్చుకున్న పేరే నిదర్శనం.

సినిమా

ప్రతి కణం కణం...


సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్

టైగర్, జోయాల ప్రేమ బలమైనది. ప్రేయసి మీద తనకున్న ప్రేమను వ్యక్తపరచడానికి 'మెరిసే నీ కనులే.. ముసిరే నీ కనులే..', 'ప్రతి కణం.. కణంలో...' అంటూ పాట అందుకున్నారు టైగర్. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'టైగర్ జిందా హై'కి సీక్వెల్‌గా రూపొందిన 'టైగర్ 3'లోని పాట ఇది. టైగర్‌గా సల్మాన్ ఖాన్, జోయాగా కత్రినా కైఫ్ నటించగా మనీష్ శర్మ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలోని రెండో పాట 'ప్రతి కణం కణం..'ను మంగళవారం రిలీజ్ చేశారు. ''ఈ పాట టైగర్, జోయాల అన్యోన్యతను ఆవిష్కరించే విధంగా ఉంటుంది. ఆ కెమిస్ట్రీని సిల్వర్ స్క్రీన్‌పై చూసి, అనుభూతి చెందాల్సిందే. అందుకే వీడియోను ముందుగా రిలీజ్ చేయలేదు'' అన్నారు ఆదిత్యా చోప్రా. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది.

యాత్రలో జర్మనీ నటి సుజానే



'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'యాత్ర 2'. ఇందులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా నటిస్తున్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక నిర్మిస్తున్న 'యాత్ర 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమాలో సోనియా గాంధీ పాత్రని జర్మనీ నటి సుజానే బెర్నెర్ట్ పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మహి వి. రాఘవ్ మాట్లాడుతూ–''యాత్ర'కి కొనసాగింపుగా 'యాత్ర 2' రూపొందుతోంది. వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరుని, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనలను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. 'యాత్ర 2'ని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

నా తలరాతే రంగుల రంగోలి...


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు అభిమానుల్లో దీపావళి పండగ సంబరం ఆరంభమైంది. జోష్‌గా పండగ చేసుకునేలా మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం' నుంచి 'దమ్ మసాలా...' పూర్తి పాటను విడుదల చేశారు. ఈ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ పుట్టినరోజు (నవంబర్ 7) సందర్భంగా మంగళవారం ఈ పాటను రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు తమన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. ''నా తలరాతే రంగుల రంగోలి.. దిగులైనా చేస్తా దీవాలి.. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి', 'నేనో నిశ్శబ్దం.. అనునిత్యం నాతో నాకే యుద్ధం' అంటూ సాగే ఈ పాట హీరో పాత్ర తీరుని తెలియజేసే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మహేశ్ సరసన శ్రీలీల కథానాయికగా, మీనాక్షీ చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులతో ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

దీపావళి మనసుని హత్తుకుంటుంది – 'స్రవంతి' రవికిశోర్



''ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా చూస్తున్నారు. మా 'దీపావళి' చిన్నదైనా అందమైన సినిమా. ఇందులోని భావోద్వేగాలు ప్రేక్షకుల మనసులను హత్తుకుంటాయి'' అని నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ అన్నారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కీడా' (తెలుగులో 'దీపావళి'). కృష్ణ చైతన్య సమర్పణలో 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''నిర్మాతగా 38 ఏళ్ల జర్నీలో దాదాపుగా నేను చేసిన సినిమాలన్నీ సంతృప్తినిచ్చాయి. నేను డబ్బుల గురించి ఆలోచించను. ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవుతుందా? లేదా అని మాత్రమే ఆలోచిస్తా. కథ పూర్తయ్యాకే సినిమాని సెట్స్ మీదకు తీసుకెళతాను. ఓ సినిమా పూర్తయ్యాకే మరొకటి చేస్తాను. నేను తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే. 'దీపావళి' కథని ప్రాణం పెట్టి రాశాడు వెంకట్. చెప్పిన కథను చెప్పినట్లు స్క్రీన్ మీదకు తీసుకొచ్చాడు. మా సినిమా ఇండియన్ పనోరమాకి ఎంపికవడం గొప్ప అనుభూతి. చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శించడం సంతోషంగా ఉంది. ఇక రామ్ హీరోగా ఓ సినిమా చేసేందుకు స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అలాగే రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలని ఉంది. ఇందుకు సరైన కథ కుదరాలి'' అన్నారు.

జపాన్‌లో నటిగా కనిపిస్తాను


అనూ ఇమ్మాన్యుయేల్


''జపాన్' వైవిధ్యమైన చిత్రం. చాలా క్రేజీగా ఉంటుంది. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లోనే చూడాలి'' అని హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న రిలీజవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''రాజు మురుగన్‌గారి సినిమాలు వైవిధ్యంగా ఉంటాయి. అలాగే 'జపాన్' కూడా. ఈ చిత్రంలో ఓ నటిగా కనిపిస్తా. నా పాత్ర జపాన్ (కార్తీ) లైఫ్‌లో కీలకంగా ఉంటుంది. ఇక ఫలానా పాత్ర చేయాలనే కలలు నాకు లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు.

వారి మాటలే నాలో స్ఫూర్తి నింపాయి – సురేష్ కొండేటి



''సంతోషం' సినీ వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా 'ఫిల్మ్ ఫేర్' అవార్డుల్లాగా సంతోషం అవార్డులు ఇస్తే బాగుంటుందని నాగార్జునగారు అన్నారు. దీంతో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రతి ఏటా ఇస్తున్నాను. అలాగే నన్ను నిర్మాతగా చూడాలని చిరంజీవిగారు అనడంతో నిర్మాత అయ్యాను. వారిద్దరి మాటలు నాలో స్ఫూర్తి నింపడంతో ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను'' అని నిర్మాత, 'సంతోషం' సినీ వారపత్రిక అధినేత సురేష్ కొండేటి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ నెల 18న హైదరాబాద్‌లో 'సంతోషం ఓటీటీ అవార్డ్స్'ని ఇస్తున్నాం. డిసెంబరు 2న గోవాలో 'సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ వేడుకకు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవుతారు. సంతోషం అవార్డ్స్‌ని 25ఏళ్ల పాటు కొనసాగించాలనుకున్నాను. ఇప్పటికి 22 ఏళ్లయింది. ఇంకో మూడేళ్లు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాను. మరోవైపు సినిమాలు నిర్మిస్తున్నాను. నటుడిగా ఐదారు సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను'' అన్నారు.

లవ్.. థ్రిల్...


హృతిక్ శౌర్య

హృతిక్ శౌర్య హీరోగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'అశ్వత్థామ'. 'హతః అశ్వత్థామ' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ – ''ఓ టు'తో హృతిక్ హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన 'అశ్వత్థామ'లో కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం హృతిక్ చేసిన యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది'' అని అన్నారు.

పాటల్లో నవరసాలుంటాయి – సుభాష్ ఆనంద్



''అలా నిన్ను చేరి' సినిమాలోని ప్రతీ పాట అద్భుతంగా ఉంటుంది. ఒక్కో పాటను ఒక్కో శైలిలో కంపోజ్ చేసే చాన్స్ నాకు దొరికింది. నవరసాలను చూపించేలా ఇందులోని పాటలుంటాయి'' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ లవ్ స్టోరీ చిత్రమిది. ప్రేమ కథా చిత్రాలకు సంగీతమే ప్రాణం. నేను చాలా సినిమాలకు సంగీతం అందించాను. అయితే 'అలా నిన్ను చేరి' నా కెరీర్‌కి గుడ్ టర్న్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

ఆరుగురి కథ


'టెనెంట్'లో ఓ దృశ్యం

'సత్యం' రాజేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'టెనెంట్'. ఇందులో మేఘా చౌదరి హీరోయిన్. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ళ చంద్ర శేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా వై. యుగంధర్ మాట్లాడుతూ– ''జీవితం ఆడే వైకుంఠ పాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్య పాత్రల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్ లైఫ్ జీవన శైలిలో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ తయారు చేసిన ఈ కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: జెమిన్ జోం అయ్యనీత్, సహనిర్మాత: ఎన్. రవీందర్ రెడ్డి.